ప్రజాశక్తి
శుక్రవారం 16 జూన్ 2023
5
పార్వతీపురం మన్యం

ప్రతిభ మీదైతే ప్రోత్సాహం మాది

కలెక్టరేట్ : యువతలో ప్రతిభను ప్రోత్సహించేందుకు కేంద్ర యువజన వ్యవహారాలు,కీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్రం స్థానిక ఎస్వి డిగ్రీ కళాశాలలో ఈ నెల 22న 2047 అనే థీమ్ తో సజనాత్మక రచన, కవిత్వం, చిత్రలేఖనం, మొబైల్ ఫోటోగ్రఫీ, ఉపన్యాసం, సాంస్కృతిక /జానపద కళలు వంటి అంశాలపై యువ ఉత్సవ్ నిర్వహించనున్నామని నెహ్రు యువ కేంద్ర పార్వతీపురం మాన్యం జిల్లా యువ అధికారి కె. వెంకట్ ఉజ్వల్ ఒక ప్రకటన తెలిపారు. ఆయా విభాగాలలలో గెలుపొందిన విజేతలకు బహుమతి, నగదు, ధ్రువ పత్రాలు అందజేయడమే కాకుండా ప్రతిభావంతులకు జాతీయ స్థాయి వరకు యువ ఉత్సవ్ లో వెళ్లే అవకాశం ఉందని అన్నారు. యువ ఉత్సవ్ పోటీలలో పాల్గొనదలచిన యువతీయువకులు 15 నుండి 29 వయస్సు లోపు ఉన్న యువ ఔత్సాహికులు వారి వివరాలు రిజిస్ట్రేషన్ చేయించుకుని పోటీలలో పాల్గొనాలని తెలిపారు. వివరాలకు పార్వతీపురం మన్యం నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో లేక 7386325310 ఫోన్ కు సంప్రదించాలని తెలిపారు.

గిరిజన రైతులు సాగు చేసిన కొండపోడు భూమి

పైసలిస్తే చాలు పట్టాలపై సంతకాలు

అనర్హులకు భూములు... అర్హులకు మొండిచేయి
భూపంపిణీ పథకంలో అధికార పార్టీ నాయకుల చేతివాటం!

పైసలు చెల్లిస్తే చాలు పట్టాలపై సంతకాలతో పాటు భూములు కూడా ఎవరి పేరు మీద ఉన్నా, ప్రభుత్వ భూములైనా ముడుపులిచ్చే వారి పేరున మార్చేందుకు రెవెన్యూ అధికారులు వెనుకాడడం లేదు. మండలంలో రెవెన్యూ శాఖలో ధ్రువీకరణ పత్రాలు నుంచి భూములు ఆన్లైన్లో వరకు జరుగుతున్న అవినీతి అక్రమాలకు నిదర్శనమే ఇటీవల కాలంలో జరిగిన అనేక ఘటనలు ఆలస్యంగా వెలుగులోకి వస్తున్నాయి. రానున్న రోజుల్లో ప్రభుత్వం మంజూరు చేసే భూ పంపిణీ పథకంలో అధికార పార్టీ నాయకులు చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఇదే జరిగితే అర్హులకు మొండిచేయే. ఇలాంటి ఘటనే ఒకటి స్థానిక ఎమ్మెల్యే దృష్టిలోకి వెళ్లడంతో నాయకులపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేసినట్లు వైసిపి నాయకులు నుంచి సమాచారం.

ప్రజాశక్తి కొమరాడ

మండలంలో గత ఏడాది నుంచి రెవెన్యూ శాఖలో అనేక అవకతవకలు, అక్రమాలు జరుగుతున్నట్లు సర్వత్రా చర్చ జరుగుతున్నా అడ్డుకట్ట వేసే నాథుడే కరువు అవ్వడంతో వారి జోరు మరింత పెరిగింది. భవిష్యత్తులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా భూములేని నిరుపేదలకు భూమి పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతున్న విషయం తెలిసిందే. అయితే భూ పంపిణీ పథకంలో భాగంగా భూములేని నిరుపేదలకు కొండ పోరంబోకు డి పట్టా భూములు మంజూరు చేసేందుకు అధికారులు సర్వే జరిపి నివేదికలు సిద్ధం చేస్తున్నారు. ఇదే తరుణంలో మండలానికి చెందిన కొంతమంది వైసిపి నాయకులు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై ఈ ఏకంగా డి-పట్టా భూములు తమ పేరున పెట్టేసి మంజూరుకు నివేదికలు పంపిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శివిని, విక్రంపురం, చినఖర్జేల తదితర పంచాయతీల పరిధిలో భూములేని నిరుపేద రైతులు పదుల సంఖ్యలో ఉన్నప్పటికీ వారికి సిఫార్సు చేయకుండా, అనర్హులైన పెత్తందారులైన వైసిపి నాయకులకు పట్టాలు మంజూరు చేసేందుకు రెవెన్యూ అధికారులు ప్రయత్నించడం మండలంలో చర్చగా మారింది. రెవెన్యూ అధికారులకు భారీగా ముడుపులు చెల్లిస్తే ఏ పనైనా చేసేస్తారన్న మాటకు నిదర్శనంగా ఇప్పుడు జరుగుతున్న అనేక పనులు స్పష్టంగా కనిపిస్తుంది. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం భూములేని గిరిజన దళితులకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ కొండ పోరంబోకు పట్టాలు మంజూరు చేసేందుకు నిబంధనలు ఉన్నాయి. స్థానిక రెవెన్యూ అధికారులు అర్హులైన గిరిజన, దళితులు రైతులు ఎంతోమంది ఉన్నప్పటికీ వారి పేర్లు పెట్టకుండా వైసిపి నాయకులు పేరు పెట్టి నివేదికలు పంపించడంపై అర్హులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 421 మందికి సుమారుగా 430 ఎకరాలు డి- పట్టా భూములు మంజూరు చేసేందుకు ప్రతిపాదనలు పంపించారు. అర్హులైన గిరిజన, దళితులు రైతులు సాగు చేస్తుండగా, వారికి మాత్రం కేవలం 5, 10, 15, 20 సెంట్లు చొప్పున పట్టాలిచ్చేందుకు నివేదికలు పంపించారు. వైసిపి నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు వారి కుటుంబ సభ్యులకు ఇతర ముడుపులు తీసుకొని వారికి ఎకరాల చొప్పున భూమి ఇచ్చేందుకు సిద్ధపడ్డారంటే అధికారులు ఎంత బరితెగించారోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు పంపిన నివేదికలో అనేక మందికి అనర్హులు ఉన్నప్పటికీ పట్టాలు మంజూరు చేస్తే జిల్లా కలెక్టర్కు, సిఎం డాష్ బోర్డుకు గిరిజన, దళిత రైతులు ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం.

మరో వైపు ఇటీవల కాలంలో దుగ్గిలో తోటపల్లి జలాశయం కోసం సేకరించిన భూమి ఇతరుల పేరున ఉన్న ప్రభుత్వం భూమిని ఆన్లైన్లో వైసిపి నాయకుల పేరుకు మార్చడంతో నియోజవర్గంలోనే తీవ్ర చర్చ జరిగింది. ఈ విషయం ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణి దృష్టికి వెళ్లడంతో నాయకులకు, రెవెన్యూ అధికారులకు తప్పుడు పని చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించినట్లు తెలిసింది. ఏది ఏమైనా మండలంలో భూముల ధరలకు రెక్కలు రావడంతో అక్రమార్కులు రెవెన్యూ అధికారులకు ముడుపులు చెల్లించి భారీగా పేర్లు తారుమారు చేస్తున్నట్లు చర్చ జరుగుతుంది. అలాగే రోడ్డుకు ఆనుకొని ఉన్న అనేక డి-పట్టా భూములు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పెత్తందార్లకు కట్టబెట్టేందుకు రెవిన్యూ అధికారులు సిద్ధమైనట్లు కూడా ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మండలంలో జరుగతున్న భూ అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఈ విషయంపై తహశీల్దార్ సిహెచ్ రాధాకృష్ణ వివరణ కోరగా అర్హులైన రైతులందరికీ పేర్లను సిఫార్సు చేశామని అన్నారు. అనర్హుల పేర్లు ఎటువంటివి సిఫార్సు చేయలేదని తెలిపారు. ఇంకా అనర్హులెవరైనా ఉంటే తెలియజేస్తే ఉన్నతాధికారులకు నివేదికలు అందజేస్తామని తెలిపారు.

మొబైల్ టవర్లు ప్రారంభోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

ఏజెన్సీలో డిజిటల్ విప్లవానికి నాంది : సిఎం

మన్యంలో మొబైల్ టవర్లు వర్చువల్ విధానంలో ప్రారంభం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మారుతున్న కాలానికి అనుగుణంగా సెల్ టవర్ల ఏర్పాటుతో ఏజెన్సీలోని మారుమూల గ్రామాల్లో డిజిటల్ విప్లవానికి నాంది పలికామని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. జిల్లాలో నిర్మాణం పూర్తయిన మొబైల్ టవర్లను గురువారం ఆయన వర్చువల్ విధానంలో ప్రారంభించారు. మండలంలోని శిఖలబాయిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గిరిజనులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ టవర్ల ఏర్పాటుతో డిజిటల్ విప్లవం వచ్చి గొప్ప మార్పుకు నాంది పలకనుందని అన్నారు. డిసెంబరు నాటికి అన్ని టవర్ల నిర్మాణం పూర్తి చేయాలని ఆయన సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 4జి కవరేజ్ వస్తుందని, రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో ఏర్పాటు చేయాల్సిన 52 టవర్లను ఒకేసారి అటవీ అనుమతులు మంజూరు చేశామని చెప్పారు. కురుపాం ఎమ్మెల్యే పి.పుష్ప శ్రీ వాణి మాట్లాడుతూ గిరిజన ప్రాంతం విద్య, వైద్యం వంటి ప్రాథమిక అవసరాలకు దూరంగా ఉందని, కమ్యూనికేషన్‌కు మరింత దూరంగా ఉన్నామని అన్నారు. సెల్‌టవర్ల ఏర్పాటుతో ఆ సమస్య పరిష్కారమైందన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి పి.కిరణ్‌కుమార్, గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఎంపిపిలు కె.దీనమయ్య, శెట్టి పద్మావతి, ఉపాధ్యక్షులు ఎన్.శేఖర్, ఎన్.లక్ష్మణ రావు జెడ్పీటీసీలు ఎం.రాధిక, జి.సుజాత, ఎంపిటిసి ఎం.రమణ, సర్పంచ్ బి.రాజారావు, ఉప సర్పంచ్ బి.చిట్టెమ్మ , బిసి కార్పొరేషన్ డైరక్టర్ జి.గిరిబాబు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ కు వినతి

మండలంలోని కుక్కిడి పంచాయతీ రెబ్బగూడ గ్రామంలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ గ్రామ గిరిజనులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే గ్రామంలో నిర్మిస్తున్న ప్రభుత్వ పాఠశాల భవనం పనులు మధ్యలో నిలిచిపోయాయని దీంతో విద్యార్థుల చదువుకు ఆటంకంగా మారిందని అన్నారు. గ్రామ సమీపంలో ఉన్న చెక్ డాం మరమ్మతులు చేపట్టి ఈ ఖరీఫ్ నాటికి పొలాలకు సాగునీరు అందించాలని కోరారు. సమస్యలపై స్పందించిన ఆయన సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

పాచిపెంట : మండలంలోని కేసలి పంచాయితీ కుంతాంబడేవలసలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయా గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమానికి పాల్గొన్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్ మాట్లాడుతూ మొబైల్ టవర్లు ఏర్పాటుతో గిరిజన ప్రాంతాల్లో నూతన శకం ప్రారంభమవుతుందని అన్నారు. ఎంపిపి ప్రమీల మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్య సదుపాయాలతో పాటు మొబైల్ టవర్లు ఏర్పాటుతో గిరిజనులకు సాంకేతిక పరిజ్ఞానం అందించాలని ఆలోచన ప్రభుత్వం ఉండడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో వెలుగు ఎపిడి సత్యం నాయుడు. తహశీల్దార్ రాజశేఖర్, ఎంపిడిఒ జి.పార్వతి, ఎపిఎం సత్యనారాయణ, పలువురు సర్పంచులు, ఎంపిటిసిసభ్యులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి

ప్రజాశక్తి - సాలూరు

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ చెప్పారు. గురువారం స్థానిక లక్ష్మీ థియేటర్ ఆవరణలో మెప్మా అర్బన్ బజార్ ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. పట్టణంలోని డ్వాక్రా మహిళలు ఉత్పత్తి చేసిన వస్తువులు, ఆహార పదార్థాలను బజార్‌లో ప్రదర్శనకు పెట్టారు. చైర్‌పర్సన్‌తో పాటు వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, వైసిపి నాయకులు పి.అప్పలస్వామి, బాలకష్ణ, కమిషనర్ హెచ్ శంకరరావు ఉత్పత్తులను పరిశీలించారు. ప్రతి మహిళ కుటుంబానికి అండగా నిలబడేలా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మెప్మా సిఎంఎం ఎం.పుష్ప, ఆర్పీలు పాల్గొన్నారు .

జాతీయస్థాయి వాలీబాల్ క్రీడలకు మన్యం విద్యార్థిని

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

అండర్-19 జాతీయస్థాయి వాలీబాల్ క్రీడలకు మండలంలోని లుంబేసు పంచాయితీ మారుమూల కొండలపై గల దేరుగండ గిరిజన గ్రామానికి చెందిన తోయక ప్రమీల ఆంధ్రప్రదేశ్ నుంచి బాలికల టీంకు ప్రాతినిధ్యం వహించింది. జూన్ 1 నుంచి 7 వరకు మధ్యప్రదేశ్‌లోని భోపాల్ లో నిర్వహించిన జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొంది. ప్రమీల గుమ్మలక్ష్మీపురం కస్తూరిబా కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. మారుమూల గ్రామం నుంచి విద్యార్థిని జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొనడం పట్ల ప్రిన్సిపల్ రంజని, పిడి అరుణ జ్యోతి, మండల ప్రజలు, స్నేహితులు అభినందించారు.

సీతానగరంలో భిక్షాటన చేస్తున్న పంచాయతీ కార్మికులు

పంచాయతీ కార్మికుల భిక్షాటన

ప్రజాశక్తి - సీతానగరం

పంచాయతీల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు ఏడాది కాలంగా జీతాల్లేక, ఇతర పనులకు వెళ్లలేక, ఇతర ఆదాయ మార్గాలు లేక తమ కుటుంబాలను పస్తులతో ఉంచుతున్నామని, కావున తక్షణమే తమ జీతాలు చెల్లించాలని, మండలంలో గల అన్ని పంచాయతీల కార్మికులు సీతానగరంలో గురువారం ప్రభుత్వ కార్యాలయాల్లోనూ, మార్కెట్లో భిక్షాటన చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి గవర వెంకటరమణ, గ్రీన్ అంబాసిడర్ల సంఘ నాయకులు జలుమూరు గౌరు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

జియమ్మవలస : తమకు జీతాలు సక్రమంగా చెల్లించాలంటూ మండలంలోని గ్రీన్ అంబాసిడర్లు పెదమేరంగి జంక్షన్‌లో నిరసన తెలిపారు. 9నెలలుగా జీతాలు తమకు అందడంలేదని, మూడుసార్లు కలెక్టర్ కార్యాలయం వద్దకు వెళ్లి తన సమస్యను తెలియజేశామని అయినా అధికారులు తమ జీతాలు గురించి పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండేటప్పుడు జీతాలు సక్రమంగా వచ్చాయని పంచాయతీలకు గ్రీన్ అంబాసిడర్ అప్పజెప్పడంతో జీతాలు గత తొమ్మిది నెలలుగా తమకు అందక కుటుంబ పోషణ కష్టతరంగా మారిందని వారు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం మండలంలో 31 పంచాయతీలు 70 మంది గ్రీన్ అంబాసిడర్లు పనిచేస్తున్నారు. వీరంతా జీతాలు అందక ఆందోళన చెందుతున్నారు. ఈ కార్యక్రమంల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గరుగుబిల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఉపాధి హామీలో ఉద్యాన మొక్కలు

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఉపాధి హామీ చట్టం కింద ఉద్యాన మొక్కలు అధిక సంఖ్యలో నాటేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్. జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో గురువారం గహ నిర్మాణం, రీ సర్వే, ప్రాధాన్యతా పనులు తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిర్దేశిత లక్ష్యం పూర్తి చేయడమే కాకుండా 10 వేల ఎకరాల వరకు వేయాలని చర్యలు చేపడుతున్నామని అన్నారు. గృహ నిర్మాణం, ప్రాధాన్యత పనులు త్వరగా పూర్తి చేయాలని ప్రయత్నిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో జెసి ఆర్.గోవిందరావు, ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్, డిఆర్ఒ జె.వెంకట రావు, డ్వామా పీడీ కె.రామచంద్ర రావు, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, హౌసింగ్ ఇన్‌ఛార్జ్ పీడీ టి.రమేష్, డిపిఒ బలివాడ సత్యనారాయణ, జిల్లా సర్వే సెటిల్మెంట్ అధికారి కె. రాజ కుమార్, సిపిఒ పి.వీర్రాజు, తదితరులు పాల్గొన్నారు.

కలప స్వాధీనం రెండు టాక్టర్లు సీజ్

ప్రజాశక్తి -కురుపాం

తోటపల్లి నుంచి రాజాంకు రెండు ట్రాక్టర్లతో రూ.లక్షా70వేల విలువైన పాసి కర్రలను బుధవారం రాత్రి తరలిస్తుండగా కురుపాం ఫారెస్ట్ రేంజర్ ఆఫీసర్ ఆర్. రాజబాబు తన సిబ్బందితో కలిసి తోటపల్లికి ఖడ్గవలసకు మధ్యలో పట్టుకొన్నారు. ఈ కలపను కురుపాం అటవీశాఖ కార్యాలయానికి తరలించి రెండు ట్రాక్టర్లను, కలపను సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది రౌతు కోటి తదితరులు పాల్గొన్నారు.

పది రోజుల నుంచి తాగునీరు లేదు

ఎమ్మెల్యే వద్ద మహిళల ఆవేదన

ప్రజాశక్తి - వీరఘట్టం

తమ గ్రామానికి సమీపంలో పైపులైను మరమ్మతులకు గురికావడంతో పది రోజుల నుంచి గుక్కెడు మంచినీళ్లు దొకరడంలేదని యు.వెంకంపేట మహిళలు స్థానిక ఎమ్మెల్యే వి.కళావతికి తమ గోడును వెల్లబుచ్చుకున్నారు. గురువారం గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమం ఈ నిర్వహించిన ఎమ్మెల్యేకు తమ సమస్యను విన్నవించారు. కుళాయిల ద్వారా మంచినీరు రాకపోవడంతో గ్రామంలో మోటర్ సదుపాయం ఉన్న వారిని బతిమలాడుకొని కొద్దిగా గొప్ప నీరు పట్టుకుని కాలం వెలదీస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ తక్షణమే తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యు ఎస్‌జెని ఆదేశించారు. బిసి కాలనీలో గృహాలకు ఇరువైపులా కాలువలు లేకపోవడంతో వర్షం పడితే నీరు గృహాలు చుట్టూ నిలిచిపోతుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. తమకు ఇళ్లు మంజూరు చేయాలని, బిటి రోడ్డు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎస్ లక్ష్మి -సింహాచలం, జడ్పిటిసి జంపు కన్నతల్లి- ఉమామహేశ్వరరావు, చిదిమి గ్రామ సర్పంచ్ డి ఉమామహేశ్వరరావు, మండల ఉపాధ్యక్షులు పి.విజయకుమారి, తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి

1 నాటికి మొదటి బ్లాక్ పూర్తి చేయాలి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఏరియా ఆసుపత్రిలో జరుగుతున్న పనులను వేగవంతం చేయాలని ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి అధికారులను ఆదేశించారు. జూలై 1 నాటికి మొదటి బ్లాక్‌ను పూర్తి చేయాలని, లేకుంటే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. గురువారం ఆమె ఆసుపత్రి పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యతను పరిశీలించి రిపోర్ట్ సమర్పించాలని గిరిజన సంక్షేమ శాఖ ఇఇని ఆదేశించారు. అనంతరం సీతంపేట మినీ గురుకులాన్ని తనిఖీ చేశారు. మరుగుదొడ్లకు తలుపులు ఏర్పాటు చేయాలని సూచించారు. తరగతి గదులు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తక్కువమంది విద్యార్థులు వచ్చినాసరే తరగతులు ప్రారంభించాలని అన్నారు. అనంతరం దోనుబాయి పిహెచ్‌సిని పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఆసుపత్రి పరిసరాలు పరిశీలించారు. రికార్డులు, ఆసుపత్రి నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై డెప్యూటీ డిఎంహెచ్‌ఒకు విచారణ నిర్వహించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు, పిహెచ్‌సి వైద్యాధికారి, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నివారణ చర్యలు చేపట్టాలి

మలేరియా నిర్మూలనకు చేపట్టాల్సిన చర్యలను వెంటనే చేయాలని పిఒ కల్పన కుమారి అన్నారు. గురువారం రెండు జిల్లాల డిఎంఒలు, డిఎల్‌డిఒలు, డిఎంహెచ్‌ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో తప్పనిసరిగా క్లోరినేషన్ చేయాలన్నారు. పంచాయతీ సెక్రటరీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ బాధ్యత తీసుకోవాలని అన్నారు. అన్నీ పాఠశాలల్లో స్ప్రేయింగ్ చేయాలని అన్నారు. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. ఫ్రైడే, డ్రైడే పక్కాగా నిర్వహించాలన్నారు. దోమలు ఎక్కువగా ఉండే ప్రాంతాలపై దృష్టి పెట్టాలని అన్నారు. ఎంపిడిఒల ద్వారా ప్రతీ వారం సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని అన్నారు.

కొత్త మెనూ పక్కాగా పాటించాలి

కొత్తగా వచ్చిన మెనూను పక్కాగా అమలు చేయాలని పిఒ కల్పన కుమారి ఆదేశించారు. హెచ్‌ఎంలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వసతి గృహాల్లో పామాయిల్ వాడకూడదని సూచించారు. అన్ని పాఠశాలల్లో నాడు నేడు పనులు పూర్తి చేయాలన్నారు. పనుల్లో నాణ్యత లోపించకూడదన్నారు. పాఠశాలల్లో మలేరియా, డెంగీ నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు పాఠశాలకు వచ్చిన తర్వాత వైద్య పరీక్షలు చేయించాలని అన్నారు. ప్రతి పాఠశాలలో అడ్మిషన్లు పెంచాలని అన్నారు. డ్రాపౌట్స్ డేటా తయారు చేయాలన్నారు. జెవికె కిట్లు అందరికీ అందజేయాలన్నారు. సమావేశంలో ఎపిఒ రోసిరెడ్డి, డిప్యూటీ డిఇఒ లిల్లీరాణి, ఎటిడబ్ల్యుఒలు, ఎఎంఆర్‌సిలు, సిబ్బంది పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లపై సచివాలయ సిబ్బందికి అవగాహన

ప్రజాశక్తి - మక్కువ

రీ సర్వే జరిగిన మూడు రెవెన్యూ గ్రామాలతో సహా మొత్తం 13 గ్రామాల్లో క్రయవిక్రయాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్లపై సచివాలయ ఉద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గురువారం సాలూరు సబ్ రిజిస్టర్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ పెంటయ్య ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. భూ రిజిస్ట్రేషన్లకు సంబంధించిన విషయాలను వివరంగా సచివాలయ ఉద్యోగులకు ఈ సందర్భంగా తెలియజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ షేక్ ఇబ్రహీం, రీసర్వే డ్యూటీ హేమలత, ఆయా సచివాలయ కార్యదర్శులు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే వేగవంతం చేయాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలో ఎన్‌సిడి, సిడి సర్వే వేగవంతం చేయాలని ఎంపిడిఒ జయంత్ ప్రసాదు ఎఎన్‌ఎంలను ఆదేశించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎఎన్‌ఎంలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. దీర్ఘకాలిక రోగులను గుర్తించి వారి వివరాలు సీడీల రూపంలో నమోదు చేయాలన్నారు. సాకులు చెప్పకుండా త్వరితగతిన గ్రామాలు దర్శించి సర్వే పూర్తికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో వీరఘట్టం, బిటవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు జి.ప్రదీప్ కుమార్, మానస, ఎఎన్‌ఎంలు పాల్గొన్నారు.

సాలూరు, పాలకొండ మున్సిపల్ కార్యాలయాల వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు, సిఐటియు నాయకులు

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

మున్సిపల్ కార్యాలయాల వద్ద నిరసన

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాల్టీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు ఆధ్వర్యాన గురువారం స్థానిక కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల ముందు సిఎం జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ లు నాలుగేళ్ల యినా అమలు కాలేదని చెప్పారు. సాలూరు మున్సిపాలిటీ లో మరణించిన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేశారు .బకాయిపడిన నాలుగు నెలల హెల్త్ అలవెన్సులను విడుదల చేయాలన్నారు. తక్షణమే మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంటాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగం పర్మనెంట్ చేయాలని, సంక్షేమ పథకాలు గుర్తింపు చేయాలని, సిపిఎస్ రద్దుచేసి ఒపిఎస్ విధానాన్ని అమలు చేయాలని, క్లాప్ ఆటో డ్రైవర్లకు జీవో 7 ప్రకారం 18,500 రూపాయలు గౌరవ వేతనం ఇవ్వాలని, మున్సిపల్ కాంట్రాక్ట్ పరిషత్ కార్మికులకు రెండు నెలల హెల్త్ అలవెన్సులు ఇవ్వాలని, డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్లమంలో ఫెడరేషన్ నాయకులు టి.శంకరరావు,టి.రాముడు, స్వప్న పాల్గొన్నారు.

పార్వతీపురంటౌన్ : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఉన్న ప్రజారోగ్య విభాగం అధికారులకు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సభ్యులు వినతి పత్రానిస్తూ కోరారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లె వెంకటరమణ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల్ని పర్మినెంట్ చేస్తామని అసెంబ్లీ సాక్షిగా జగన్మోహన్‌రెడ్డి చెప్పి నేటికి నాలుగేళ్లు కావస్తున్నా సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని విమర్శించారు. తక్షణమే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ పర్మనెంట్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులు , తదితరులు పాల్గొన్నారు.

నగర పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికుల ధర్నా

పాలకొండ రూరల్: నగర పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం కార్మికుల ధర్నా చేపట్టారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు (ఆప్కాస్) సి. పి. ఎస్ ఉద్యోగులు, క్లాప్ డ్రైవర్లు సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో రాష్ట్రవ్యాప్త ఆందోళన చేపడతామని హెచ్చరించారు. యూనియన్ అధ్యక్ష, కార్యదర్శు పి.భాస్కరరావు, సిహెచ్ సంజీవి, వై.హరిబాబు తదితరులు మాట్లాడుతూ ఇంజనీరింగ్ విభాగం కాంట్రాక్ట్ కార్మికులకు హెల్త్ రిస్క్ అలవెన్సులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పడాల వేణు,చింతల సురేష్,విమల ,శ్రీదేవి, పడాల సాయికుమార్, పి.శ్రీనివాసరావు, జి.నారాయణరావు, పి.ఈశ్వరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దిశ యాప్‌పై సంతలో అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

కురుపాంలో గురువారం జరిగిన వారపు సంతలో దిశ యాప్ వినియోగంపై సంతకు వచ్చిన గిరిజన మహిళలకు స్థానిక ఎస్ఐ సిహెచ్ ప్రసాద్ మహిళల సెల్ ఫోనులో దిశ యాప్ డౌన్లోడ్ చేయించి వారికి దిశ యాప్ గూర్చి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారితో ఆయన మాట్లాడుతూ దిశా యాప్ మీ సెల్ ఫోన్‌లో ఉంటే పోలీసులు మీ దగ్గర ఉన్నట్లేనని దిశా అనేది మహిళలకు రక్షణ కవచం లాంటిదని, కావున ప్రతి ఒక్కరూ సెల్‌ఫోన్‌లో దిశ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గిరిజన మహిళలు పాల్గొన్నారు.

సీతానగరం: పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మెగా దిశ యాప్‌పై ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై కె.నీలకంఠ మాట్లాడుతూ దిశా యాప్‌తో సమస్య ఉంటే వెంటనే ఫోన్ చేస్తే పోలీసులు అక్కడ చేరుకొని పరిష్కరించే దిశగా కృషి జరుగుతుందన్నారు. 21 సచివాలయాల నుంచి మహిళా పోలీసులు 600 మందికి దిశా యాప్ రిజిస్ట్రేషన్ చేయించారు. కార్యక్రమంలో హెచ్‌సి సుజాత, పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

చిన్నారిని అభినందిస్తున్న సాహితీవేత్తలు

నిత్య చైతన్య దీప్తి శ్రీశ్రీ

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

తెలుగు సాహిత్య, చైతన్య దీప్తి మహాకవి శ్రీశ్రీ అని వక్తలు కొనియాడారు. గురువారం స్థానిక వేదాంత జూనియర్ కళాశాలలో స్నేహ కళా సాహితీ ఆధ్వర్యంలో జరిగిన శ్రీ శ్రీ వర్ధంతి కార్యక్రమంలో పట్టణానికి చెందిన ప్రముఖ కవులు, కళాకారులు, సాహితీ అభిమానులు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ప్రముఖ కవి గంటేడ గౌరినాయుడు మాట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని తన వెంట నడిపిస్తూ కవిత్వాన్ని భూమార్గం పట్టించిన మహాకవి శ్రీశ్రీ అని అభివర్ణించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మంత్ర రఘురాధ శర్మ మాట్లాడుతూ శ్రీశ్రీ స్ఫూర్తితోనే నేటి కవులంతా ప్రజల పక్షాన నిలబడి కవిత్వాన్ని రాస్తున్నారన్నారు. ప్రముఖ కవి సిరికి స్వామినాయుడు, తెలుగు అధ్యాపకులు భవిరిపూడి తిరుపతిరావు శ్రీశ్రీ కవిత్వపు లోతులను విశ్లేషించారు. అనంతరం శ్రీశ్రీ రచించిన దేశచరిత్రలు కవితను స్నేహకళా సాహితి వేదికపై చిన్నారిరితిక్ రెడ్డి అద్భుతంగా చదవడం తన ప్రతిభను మరోసారి ప్రదర్శిం చాడు. ఈ బాలుని ప్రతిభను ప్రశంసిస్తూ గంటేడ చిన్నంనాయుడు రూ.500 నగదు బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో మల్లిపురం జగదీశ్, పక్కి రవీంద్రనాథ్, చందనపల్లి గోపాలరావు, పల్లా రోహిణీకుమార్, గడగమ్మ రామకృష్ణ, పాలకొల్లు రామలింగస్వామి, రంజిత్ కుమార్, పి.అపారావు, జి.సోమేశ్వరరావు, చిన్నంనాయుడు, నాగు కాకిముక్కల తదితరులు ప్రసంగించారు.

బలిజిపేట : మహాకవి శ్రీశ్రీ వర్ధంతి మండలంలోని పెదపెంకిలో గురువారం ఆ యువత, గ్రామస్తుల సమక్షంలో బాపూజీ గ్రంథాలయం వద్ద ఆ సంస్థ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవ నాయుడు సమక్షంలో జరిగింది. తొలుత శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంజీవ నాయుడు మాట్లాడుతూ శ్రీరంగం శ్రీనివాసరావు సమయస్ఫూర్తి, ఆలోచన గల వ్యక్తి అని కొనియాడారు. ఆయన ఆలోచనలు భిన్నంగా సమాజానికి ఉపయోగపడేలా ఉంటాయ అన్నారు. మహాకవిగా పేరుగాంచారని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

వీరఘట్టం: మండలంలోని నడుకూరు, బొడ్లపాడులో జనసేన నాయకులు ఆధ్వర్యంలో మహాకవి శ్రీశ్రీ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు ఎం.పుండరీకం, వజ్రగడ జానీ మహాకవి శ్రీశ్రీ చిత్రపటం పూలమాలనేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధులను ప్రేమించాలి

ప్రజాశక్తి - పాలకొండ

వృద్ధులను వేధించకుండా, వారిని పిల్లల్లా ప్రేమించాలని మాజీ జెడ్పిటిసి సామంతుల దామోదరరావు అన్నారు. ప్రపంచ వద్ధుల వేధింపుల నివారణ అవగాహన దినోత్సవం గురువారం స్థానిక జగన్నాథ స్వామి ఆలయం వద్ద గల బాలగోపాలా లక్ష్మీ నరసమ్మ ఓల్డ్ ఏజ్ హోంలో హెల్ప్ ఏజ్ ఇండియా, ఎల్డర్ లైన్ వారి సహకారంతో హర్యావెల్లి సేవాసంస్థ వారు నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైప దామోదరరావు మాట్లాడుతూ వృద్ధులు ఎవరిపైనా ఆధారకుండా తమ తమ కార్యక్రమాలు చేసుకోవాలన్నారు. సంస్థ కార్యదర్శి శ్రీనివాసరావు ఎల్డరీ హెల్ప్ లైన్ ఆవస్యకతను వివరించారు. కూరాకుల సంస్థ డైరెక్టర్ తూముల లక్షణరావు వృద్ధుల గురించి వివరించారు. సుమరు 50మంది వృద్ధులు పాల్గొన్నారు. సంస్థ సహాయ కార్యదర్శి సింహాచలం వందన సమర్పణతో కార్య క్రమం ముగిసింది.

విద్యార్థులకు జెవికె కిట్లు అందజేస్తున్న సర్పంచ్ ఆదిలక్ష్మి

పెద్దూరులో జెవికె కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పెద్దూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జగనన్న విద్య కానుక కిట్లను సర్పంచ్ హెచ్.ఆదిలక్ష్మి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన విద్యాభివృద్ధికి ప్రభుత్వం కోట్లాది రూపాయల ఖర్చు చేస్తుందని, దీన్ని పిల్లలకు ఉపయోగపడేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రసాద్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు నెల్లి సత్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి మస్తర్ల తనిఖీ

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని కాశీపట్నం పంచాయతీలో గురువారం స్థానిక ఎంపిడిఒ సూర్యనారాయణ ఉపాధి హామీ పనులు తనిఖీ చేశారు. కూలీలకు సకాలంలో వేతనాలు అందుతున్నాయా లేదా అన్న విషయాన్ని సింహాద్రి చెరువు వద్ద అడిగి తెలుసుకున్నారు. అలాగే రెండు పూటలా పనిచేసి గరిష్ట వేతనం కూలీలంతా అందుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిఒ ఈశ్వరమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

కొట్టు గుమ్మడలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కొట్టుగుమ్మడలో గురువారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పిహెచ్ వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి వివిధ రకాలైన రోగులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎండలు తీవ్రతంగా ఉన్నందున వడదెబ్బకు గురయ్యే అవకాశాలు మెండిగా ఉన్నాయన్నారు. బయటకు వచ్చిన ప్రతి ఒక్కరూ గొడుగు వేసుకుని వెళ్లాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ నయోమి, ఏఎన్ఎం రాజేశ్వరి, ఆశ కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

200మందికి వైద్యపరీక్షలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం శ్రీకాకుళం జిల్లా రాగోలు జెమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ ఉచిత మెగా వైద్య శిబిరంలో 200మందికి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శారు. కార్డియాలజిస్టు డాక్టర్ కల్యాణ చక్రవర్తి, డాక్టర్ శిరీష, డాక్టర్ రాజేష్తో, పాటు కంటి వైద్య నిపుణులు తనిఖీలు నిర్వహించారు. ఆపరేషన్లకు గుర్తించిన వారిని రాగోలు జెమ్స్ హాస్పిటల్లో డాక్టర్ వైయస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో ఆపరేషన్లు చేయడం జరుగుతుందని అసిస్టెంట్ మేనేజర్ పి రాజేశ్వరరావు, ఏరియా మేనేజర్ కే రమేష్ తెలిపారు. ఉచిత మెగా వైద్య శిబిరాన్ని స్థానిక సర్పంచ్ కలిశెట్టి ఇందుమతి, ఎంపిటిసి సభ్యులు దేవాతి నారాయణమ్మ, వైసిపి మండల ఎస్సి సెల్ అధ్యక్షులు దేవాతి జోజి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిఆర్ఒ అరసాడ రాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని వచ్చిన రోగులు

శిథిల భవనాల్లో తరగతులు

- ఆరు బయట వంటలు
- అరకొర పాఠ్యపుస్తకాలు పంపిణీ
- ప్రచారాలకే పరిమితం
- ఇదీ సర్కారుబడుల తీరు

శిథిలమైన పాపంపేట గ్రామ పాఠశాల

ప్రజాశక్తి - వీరఘట్టం

కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యతో పాటు మౌలిక వసతులు కల్పిస్తామని ప్రతి బడ్జెట్లోనే అన్ని శాఖల కంటే అధిక శాతం నిధులు విద్యాశాఖకు కేటాయిస్తున్నామని ప్రభుత్వాలు ఆర్భాటంగా ప్రచారాలు చేస్తున్నయే తప్ప ఆచరణలో ఎక్కడా కానరావడం లేదు. దీంతో విద్యారంగం అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఎక్కడికక్కడే ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలతో దర్శమిస్తున్నాయి.

మండలంలో 10 జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలు, ఒక కెజిబివి, ఒక గిరిజన ఆశ్రమఉన్నత పాఠశాల, 12 ప్రాథమిక ఉన్నత పాఠశాలలు, 35 ప్రాథమిక పాఠశాలలతో పాటు మూడు జిపిఎస్ పాఠశాలల ఉన్నాయి. సుమారు 4831 మంది విద్యార్థిని విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. పాపంపేట, సంధిమానుగూడ, కొంచ, కడకల్లా, కంబర వలస, వీరఘట్టం జిల్లా పరిషత్తు బాలురఉన్నత పాఠశాల, కొత్త కిమ్మీ, డిపివలస, తదితర పాఠశాలలు శిథిలావస్థకు చేరుకోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా వర్షపు నీరు శ్లాబ్పై నుంచి కిందకు పడడంతో విద్యార్థులు వర్షపు నీటిలో కూర్చుని విద్యను అభ్యసిస్తున్నారు. అలాగే విద్యార్థుల సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన మరుదొడ్లు పేరుకే తప్ప వినియోగించే దాఖలాలు కనిపించడం లేదు. సంధిమానుగూడ, డిపి వలస, కొంచ, బిటివాడ తదితర పాఠశాలల్లో నీటి సౌకర్యం లేక మరుగుదొడ్లు మూతపడ్డాయి. దీంతో విద్యార్థులు ఆరు బయటకు వెళ్లి కాలకృత్యాలు తీర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అలాగే వీరఘట్టం బిసి కాలనీ, చిట్టిపూడివలస, ఎం రాజపురం, యు వెంకంపేట, కోమటి వీధి, కంబర వలస, తదితర గ్రామ పాఠశాలలో అదనపు గదులు లేకపోవడంతో విద్యార్థులు ఇరుకైన గదులను కూర్చొని విద్యను అభ్యసించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ప్రస్తుతం చిట్టిపూడివలస, ఎం.రాజపురం విద్యార్థులు చెట్ల నీడలో విద్యను అభ్యసించాల్సి వస్తోంది.

అర్ధాంతరంగా నిలిచిన నాడు -నేడు పనులు

మండలంలోని రెండో విడత నాడు -నేడు పనుల్లో భాగంగా ఈ ఏడాది 30 పాఠశాలల్లో పనులు ప్రారంభించారు. మండలంలోని నర్సిపురం, కంబర వలస నీలానగరం, కత్తులకవిటి, వండువ, బిటివాడ, తెట్టంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు కేజీబీవీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కోమటి వీధి, రెగ్యులర్ పాఠశాల, కూరాకులవీధి తదితర పాఠశాలలో పనులు ప్రారంభించారు. అయితే సకాలంలో బిల్లులందుక అర్ధాంతరంగా పనులు నిలిచిపోయాయి. పాఠశాలల పునఃప్రారంభానికి నాడు నేడు పనులు పూర్తవ్వాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. చేసిన పనులకు బిల్లులందక అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. మే 6న సీతంపేట ఐటిడిఎ పిఒ కల్పనా కుమారి కంబర వలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించినప్పుడు పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనులు వేగవంతం అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఇక్కడ పనులు మందకోడుగా కొనసాగుతున్నాయి.

బిటివాడ గ్రామ పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

ఆరుబయటే వంటలు

మండలంలోని బొడ్లపాడు, బూరుగా, చేబియ్యంవలస, గడగమ్మ, చిట్టిపూడివలస, పివిఆర్ పురం, డిపి వలస, కడకల్లా, కత్తులకవిటి, వీరఘట్టం జిల్లా పరిషత్ బాలుర, యు వెంకంపేట, పాపంపేట, ఎం.రాజపురం, హుస్సేన్ పురం, నర్సిపురం తదితర గ్రామాల్లో వంట గదుల్లేక నిర్వాహకులు చెట్ల నీడలో మండుటెండలో వంటలు చేసి విద్యార్థులకు భోజనాలు పెడుతున్నారు. బిటివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నాలుగేళ్ల కిందట లక్ష రూపాయలు అంచనా వ్యయంతో నిర్మించిన వంటగది అర్ధాంతరంగా నిలిచిపోయింది. అదే గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో వంటగది నిర్మించినప్పటికీ పై రేకులు ఊడిపోయాయి. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో వంటగది లేకపోవడంతో పాఠశాల వరండాలో వంటలు చేసి విద్యార్థులకు భోజనాలు అందిస్తున్నారు.

తాగునీటి బోర్లు లేక అవస్థలు

మండలంలోని నర్సిపురం, కొంచ, సంధిమానుగూడ, డిపి వలస, బిటివాడ, వండువ, తదితర పాఠశాల వద్ద తాగునీటి బోర్లు లేకపోవడంతో పంట నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. వండవ ఉపరితల పథకం ద్వారా నీరు వచ్చే నీరుపై ఆగ్రామ పాఠశాల వంట నిర్వాహకులు ఆధారపడి విద్యార్థులకు భోజనాలు వండుతున్నారు. ఇదే ఆవరణలో నాలుగేళ్ల కిందట రూ.60 వేలతో బోరుబావి తవ్వినప్పటికీ అర్ధాంతరంగా నిలిపివేశారు.

కానరాని ప్రహరీ గోడలు

వీరఘట్టం బిసికాలనీ, బిటివాడ, పాపంపేట, బొడ్లపాడు, పివిఆర్ పురం, కొత్తకిమ్మీ, డిపి వలస, చేబియ్యంవలస, పెద్దూరు, కడకల్ల, కొంచ, జె.గోపాలపురం, బూరుగ, సంధిమానుగూడ, కోమటి వీధి, కె.ఇచ్ఛాపురం, కంబరవలస, యు.వెంకంపేట, చిదిమి, తదితర గ్రామ పాఠశాలలకు ప్రహరీ గోడల్లేవు. రహదారులు పక్కన పాఠశాల ఉండడంతో ఏ సమయంలో ఎటువంటి ప్రమాదం సంభవిస్తుందని ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. బిసికాలనీ పాఠశాల వద్ద ప్రహరీ గోడ లేకపోవడంతో అపారిశుధ్య నడుమ పాఠశాలను నిర్వహిస్తున్నారు.

పూర్తిస్థాయిలో బూట్లు లేవు

మండలంలోని అన్ని పాఠశాలల్లో సుమారు 4831 మంది విద్యార్థులకు పూర్తిస్థాయిలో బూట్లు రాలేదు. ఐదో తరగతి విద్యార్థులకు సంబంధించి గణితం, ఆరో తరగతి విద్యార్థులకు సంబంధించి జనరల్ సైన్స్ పాఠ్యపుస్తకాలు రాలేదు. ఏప్రిల్ 24న రాష్ట్ర టెస్ట్ బుక్స్ డైరెక్టర్ కె.రవీంద్రనాథ్ రెడ్డి మండల విద్యాశాఖ కార్యాలయాన్ని సందర్శించినప్పుడు పాఠశాలల పునః ప్రారంభానికి పూర్తిస్థాయిలో జగనన్న విద్యా కానుక పంపిణీ చేస్తామన్నారు. అయినా నేడు ఆ పరిస్థితి లేదు. సకాలంలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయలేదనన కారణంతో ఇటీవల నలుగురు విద్యాశాఖ అధికారులు సస్పెన్షన్ వేటుకు బలి అయ్యారని సంగతి తెలిసిందే. మరోసారి అటువంటి తప్పులకు తావివ్వకుండా పూర్తిస్థాయిలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలి పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అంగన్వాడీలకు వేతనాలు పెంచాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

అంగన్వాడీలకు తెలంగాణా కన్నా అదనంగా వేతనాలు పెంచుతానన్న ముఖ్యమంత్రి హామీ నీటి మీద రాతగా మిగలకుండా వెంటనే అదనంగా వేతనాలు పెంచాలని అంగన్ వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు వి.ధర్మవతి, ఎస్.గౌరమ్మ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఇందిర, కోశాధికారి జి.వెంకటరమణతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయపు బ్లాక్ ప్రాజెక్ట్ అసిస్టెంట్ స్వర్ణలతకు వినతి అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ అంగన్వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలి, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయాలని, హెల్పర్ల ప్రమోషన్లకు వయోపరిమితి 50 ఏళ్లకు పెంచాలని, రాజకీయ జోక్యం అరికట్టాలని డిమాండ్ చేశారు. వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలని, మినీ వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలి, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం కల్పించాలని, వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచాలని, గ్యాసును ప్రభుత్వమే సరఫరా చేయాలని, 2017 నుండి పెండింగ్ లో ఉన్న టిఎ బిల్లులు వెంటనే ఇవ్వాలనిసర్వీసులో ఉండి చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి, భీమా అమలు చేయాలని, లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారాన్ని సరఫరా చేయాలి, ఆయిల్, కందిపప్పు క్వాంటిటీ పెంచాలని, సీనియారిటీ ప్రకారం వేతనాలు ఇవ్వాలి, సూపర్ వైజర్ పోస్టులకు వయోపరిమితి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ భద్రగిరి ఐసిడిఎస్ కార్యాలయంలో సిఐటియు నాయకులు గురువారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కె.గౌరీశ్వరరావు, జిల్లా నాయకులు కోలక అవినాష్, అంగన్వాడి ఉద్యోగుల మండల నాయకులు కస్తూరి, సత్యవతి అన్నారు.

నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయండి.

కొమరాడ : జులై 10న అంగన్వాడి హెల్పర్లు, టీచర్లు కోర్కెల దినోత్సవం సందర్భంగా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. గురువారం ఐసిడిఎస్ కొమరాడ ప్రాజెక్టు వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. నిరసన కార్యక్రమం అనంతరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి సిడిపిఒ జి.సుగుణమ్మకి వినతిపత్రం అందజేశారు. అనంతరం సాంబమూర్తి, అంగన్వాడీ యూనియన్ నాయకులు జి.జయమ్మ, కె.రాజేశ్వరి, ఎం.లత, పి.పద్మావతి మాట్లాడుతూ దీర్ఘకాలంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జులై 10న కోర్కెల దినోత్సవం సందర్భంగా కలెక్టర్ ఆఫీస్ వద్ద జరిగే ప్రదర్శనలో అంగన్వాడి టీచర్లు, హెల్పర్లు అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

సిడిపిఒకు వినతిని అందజేస్తున్న అంగన్వాడీలు, నాయకులు

సాలూరు: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అర్బన్ ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు గురువారం ధర్నా నిర్వహించారు. ప్రాజెక్టు యూనియన్ నాయకులు రాధ, జె.శ్యామల, విజయ ఆధ్వర్యాన ధర్నా చేపట్టారు. తెలంగాణాలో కన్నా రాష్ట్రం లో అంగన్వాడీ కార్యకర్తల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం 26వేలు చేయాలని కోరారు. అనంతరం ప్రాజెక్టు అధికారి సత్యవతి కి వినతిపత్రం అందజేశారు.

సాలూరు రూరల్ :దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సాలూరు రూరల్ సిడిపిఒ మంగతయారుకు వినతిపత్రం సమర్పించారు. అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఐసిడిఎస్ పరిరక్షణ కోసం, ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పెన్షన్, పిఎఫ్ తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు నారాయణమ్మ, పార్వతి, కుమారి, జానకి, తిరుపతమ్మ, ఇందిర, ఈశ్వరమ్మ పాల్గొన్నారు

పాచిపెంట : అంగన్వాడీలకు అదనంగా వేతనాలు చెల్లించాలంటూ సిఐటియు నాయకులు టి.ప్రభావతి ఆధ్వర్యంలో సిడిపిఒ బి.అనంతలక్ష్మికి వినతి పత్రం అందజేశారు వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు

సమస్యలు తెలియజేస్తే పరిష్కరిస్తాం : ఎంపిపి

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని సమస్యలు తెలియజేస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపిపి శెట్టి శ్యామల అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జెడ్పిటిసి ద్వారపురెడ్డి లక్ష్మి హాజరయ్యారు. అనంతరం వివిధ శాఖ అధికారులు అభివృద్ధి సమస్యలపై తమ నివేదికలు చదివి వినిపించారు. ముందుగా మండల వ్యవసాయ శాఖ అధికారి శంకరరావు మాట్లాడుతూ రైతులకు అవసరమైన వరి విత్తనాలు రైతు భరోసా కేంద్రంలో సిద్ధంగా ఉన్నాయని అన్నారుఈ క్రాప్ నమోదు చేస్తేనే రైతులకు పండించిన పంటకు గిట్టుబాటు ధర కొనుగోలు జరుగుతుందన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ నివేదికలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా టిడిపి ఎంపిటిసి దేవకోటి వెంకట నాయుడు మాట్లాడుతూ చెరువుల చప్టాలు నిర్మించాలని కోరారు. తహశీల్దారు రాధాకష్ణ మాట్లాడుతూ భూరీ సర్వే ప్రక్రియ జోరుగా కొనసాగుతుందని,భూ సమస్యలు ఉంటే రి సర్వేలో రైతులు సమస్యలు తెలిపాలని సూచించారు. కొమరాడ పిఎసిఎస్ అధ్యక్షులు సురపునాయుడు, వైసిపి నాయకులు సింహాచలం నాయుడు మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ భూములు, గెడ్డలు కబ్జా అవుతున్నాయని గుర్తు చేశారు. తక్షణమే అధికారులు స్పందించి కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కుమ్మరి గుంట సర్పంచ్ లక్ష్మణరావు మాట్లాడుతూ తమ గ్రామానికి స్మశాన వాటిక సమస్య పరిష్కరించాలన్నారు. అనంతరం ఎంపిపి, జెడ్పిటిసి మాట్లాడుతూ మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రజా ప్రజలంతా సమన్వయంతో అధికారులతో కలిసి పనిచేసి గ్రామాలను అభివద్ధి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇంచార్జి ఎంపిడిఒ ఫణి బాబు, ఎఒ రమేష్, వైస్ఎంపిపి ఎన్. శరత్ బాబు, అన్నపూర్ణ, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించని సమావేశాలెందుకు? : సిపిఎం

ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సమావేశంలో చర్చలే తప్ప సమస్యలు పరిష్కారం కావడంలేదని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో అధికారులు తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సమావేశంలోని ప్రజాప్రతినిధులకు, అధికారులకు వినతిపత్రం అందజేసి మండలంలో దీర్ఘకాల ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఆయన వెంట రైతుసంఘం నాయకులు ఉపేంద్ర, టిడిపి నాయకులు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నిర్ణీత వ్యవధిలో ధ్రువపత్రాలు అందజేయాలి

ప్రజాశక్తి - మక్కువ

ప్రజలకు అవసరమయ్యే ధ్రువ పత్రాలు ప్రభుత్వం నిర్దేశించిన గడువు లోగా అందజేయాలని డిప్యూటీ తహశీల్దార్ షేక్ ఇబ్రహీం అన్నారు. గురువారం ఆయన డిప్యూటీ తహశీల్దార్గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ సిబ్బందితో ఆయన మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ చట్టం ప్రకారం తన విధులు నిర్వర్తిస్తానని ఆయన తెలిపారు

విద్యార్థినిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేత

ప్రజాశక్తి - కురుపాం

పది, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలుగా పేరు పెట్టి వారికి నగదు పురస్కారాలు అందజేస్తున్నట్టు ఎమ్మెల్యే పి.పుష్ప శ్రీవాణి అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన కురుపాం జిల్లా పరిషత్ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన ఆణిముత్యాలు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఉత్తమ ప్రతిభ కనబర్చిన ప్రథమ, ద్వితయ, తృతీయ స్థానాల విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, సర్పంచులు, ఎంపీటీసీలు, ఐదు మండలాలు ఎంఇఒలు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సాలూరు: స్థానిక డబ్బివీధి మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలో పదోతరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో మండల, నియోజకవర్గ స్థాయిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మానించారు. నియోజకవర్గ స్థాయి లో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన జ్యోతి రావు పూలే బిసి సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినులు కర్రి శ్యామల,తెంటు యామినిని, పాఠశాల ప్రిన్సిపల్ మూకల పెంటయ్యలను చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, జర్జాపు దీప్తి, ఎఎంసి చైర్ పర్సన్ దండి అనంతకుమారి, వైస్ ఎంపిపిలు రెడ్డి సురేష్, సువ్వాడ గుణవతి సన్మానించారు. నియోజకవర్గ స్థాయి లో ఇంటర్లోని అన్ని గ్రూపుల్లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు కూడా నగదు బహుమతి అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగంలో సిఎం జగన్ మోహన్ రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బవిరెడ్డి గౌతమి, వైసిపి నాయకులు పి.అప్పలస్వామి, బి.బాలకృష్ణ, ఎంఇఒలు రాజ్ కుమార్, మల్లేశ్వర రావు,హెచ్ ఎం సరోజా రెడ్డి పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ సుడిగాలి పర్యటన

ప్రజాశక్తి - కురుపాం :

స్థాని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల, మంతినవలసలో గల ఎంపిపి పాఠశాలను గురువారం సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు శాతం పాఠశాలలో రికార్డులను, నాడు-నేడు పనులు పరిశీలించి విద్యార్థులు పాఠశాలకు త్వరగా చేరుకునేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం కురుపాం సచివాలయం-1 ను సందర్శించి ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందుతున్న తీరు సచివాలయ సిబ్బంది అందిస్తున్న సేవలపై ఆరా తీసి రికార్డులను పరిశీలించి సచివాలయ సేవలు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడావలిసినా బాధ్యత సిబ్బందేనని సూచించారు.

రక్త నిల్వల్లేని బ్లడ్ బ్యాంకు ఎందుకు

సామాజిక ఆరోగ్య కేంద్రాన్నీ సందర్శించిన సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ బ్లడ్ బ్యాంకును పరిశీలించిగా రక్త నిల్వలు లేకపోవడంతో రక్తం నిల్వ లేనటువంటి బ్లడ్ బ్యాంక్ ఎందుకని ప్రశ్నించారు. అత్యవసర సమయంలో గర్భిణీలకు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి బ్లడ్ అవసరమైతే ఏం చేస్తారని వైద్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో ఒపి, రికార్డులను పరిశీలించిన అనంతరం వైద్య సిబ్బందితో మాట్లాడారు. బ్లడ్లో తప్పనిసరిగా నిల్వ ఉంచుకొని రోగుల పట్ల స్నేహభావంతో మెలగాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట తహశీల్దార్ ఆర్.రమేష్ కుమార్, ఆర్ఐ పిఎల్వి ప్రసాద్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శోభారాణి, మేజర్ పంచాయతీ ఇఒ కె.చంద్రశేఖర్, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.రామగోవిందం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బ్లడ్బ్యాంకు నిర్వహణపై అధికారులతో మాట్లాడుతున్న సబ్కలెక్టర్

ఆర్బికెల ద్వారా రైతులకు సేవలు

ప్రజాశక్తి -భామిని.

రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు వ్యవసాయ పెట్టుబడి సాయం, ఎరువులు, విత్తనాలు సకాలంలో అందేలా చూడాలని వ్యవసాయశాఖ ఎడి రత్నకుమారి సిబ్బందికి సూచించారు. మండలంలోని 134 మంది రైతులకు పెట్టుబడి సాయం అందకపోవడానికి కారణాలను ఎడి పరిశీలించారు. డెత్, ఎన్పిసిఐ, ఆధార్ లింక్ లేకపోవడం వంటి కారణాలతో పై రైతులకు పెట్టుబడి సాయం అందలేదని మండల వ్యవసాయ అధికారి కె. సింహాచలం తెలిపారు. అనంతరం స్థానిక అగ్రికల్చర్ డీర్లనుద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు షాపు లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలని, రికార్డు సక్రమంగా నిర్వహించాలని, ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ రైతులకు ఎరువులు, పురుగు మందులు విక్రయాలు నిర్వహించాలని ఎడి సూచించారు.

యువతకు వాలీబాల్ కిట్లు అందజేస్తున్న టిడిపి నాయకులు

యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి -బలిజిపేట

మండలంలోని పెద్దింపేట పంచాయతీ గౌరీపురం యువతకు టిడిపి మండల అధ్యక్షులు పెంకి వేణుగోపాల్ నాయుడు, సీనియర్ నాయకులు వాడాడ రాము వాలీబాల్ కిట్లు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాడాడ రాము మాట్లాడుతూ చంద్రబాబునాయుడును మళ్ళీ ముఖ్యమంత్రి చేస్తే యువతకు నిరుద్యోగ భృతి కింద రూ.3వేలు అందిస్తామని, అలాగే మేనిఫెస్టోలో ఉన్న హామీలను నెరవేర్చడానికి శత శాతం కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రామ్మోహన్ నాయుడు, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు